నమస్తే తెలంగాణ
# జిందగీ
11
హైదరాబాద్
ఆదివారం 4 ఫిబ్రవరి 2024
www.ntnews.com

## ..ఇప్పటికీ అర్థం కాలేదు!

**బాలీవుడ్** భామ రిచా చద్దా టెలివిజన్‌లో గ్రాండ్‌గా కనిపించనుంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న హిస్టారికల్ సీరియల్ 'హీరామండి'లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నది! బుల్లితెరపై అలరించడానికి సిద్ధమవుతున్న రిచా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. 'నేను సోషల్ మీడియాలో చురుగ్గానే ఉంటాను. అయితే, దానివల్ల ప్రయోజనం ఏంటో ఇప్పటికీ అర్థం కాదు. మనం రియల్ లైఫ్‌ను వదిలేసి, ఇంటర్నెట్‌లో బతికేస్తున్నాం. కానీ, నేను మరీ అంతకాదు! నా అభిప్రాయాలు పంచుకునే వరకే దీనిని పరిమితం చేశాను' అని చెబుతున్నది రిచా. నటిగా ఎన్నో ఎగుడుదిగుళ్లు చూశానంటున్న ఆమె... 'నటన అనుకున్నంత ఈజీ కాదు. కొన్నిసార్లు మనం ఎంచుకున్న పాత్ర చేయగలమా అన్న సందేహం వస్తుంది. ఈ విషయాన్ని ఎంతోమంది నటులను అడిగాను. వారంతా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చార'ని చెప్పుకొచ్చింది. సంజయ్ లీలా బన్సాలీ డైరెక్షన్‌లో పనిచేయడం గర్వంగా ఉందంటున్న రిచా.. మనీషా కొయిరాలా, అదితి రావు హైదరీ లాంటి తారాగణంతో కలిసి నటించడంపై సంతోషం





# లైఫ్ ఈజ్ నాట్ ఫాంటసీ!

బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్ 'సాహో'తో టాలీవుడ్ ప్రేక్షకులకూ సుపరిచితమే. 'ఆశికీ-2'తో యువత మతులు చెదరగొట్టిన శ్రద్ధ ఇండస్ట్రీలో అడుగుపెట్టి పదేండ్లు దాటిపోయింది. గ్లామర్‌తోపాటు నటనకు అవకాశం ఉన్న పాత్రలు ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న శ్రద్ధ పంచుకున్న పర్సనల్ కబుర్లు ఇవి..



### ఖాళీ దొరికితే..

తీరిక కుదరాలే గానీ.. మా కుక్కపిల్ల షైలోతో గడపడానికే ప్రాధాన్యం ఇస్తా. ఆ తర్వాతే మరేదైనా! బ్లాస్ట్ మ్యూజిక్ వింటూ రూమ్‌లో డ్యాన్స్ చేయడం నా కాలక్షేపాల్లో ఒకటి.

### అనుబంధాలు..

అప్పుడప్పుడూ మనతో మనం ఉండటం కన్నా.. మనవారితో ఉండటంలోనే ఎక్కువ ఆనందం ఉందనిపిస్తుంటుంది. బాగా ఆలోచిస్తే అదే నిజం! సిరిసంపదల కన్నా అనుబంధాలే ప్రధానం.

### ఫ్యాషన్..

గ్లామర్ ఫీల్డ్‌లో ఉన్నాను కాబట్టి... ఫ్యాషన్ ట్రెండ్స్ పాటించక తప్పడం లేదు! కాలేజ్ డేస్‌లో నన్ను చూస్తే ఈ అమ్మాయికి అసలు ఫ్యాషన్‌కు స్పెల్లింగ్ కూడా రాదేమో అనుకునే వాళ్లేమో. నాకు నచ్చినట్టుగా ఉండేదాన్ని. కాలేజీ రోజుల్లో అమ్మమ్మ బంగారు గాజులు వేసుకునేదాన్ని. నా స్నేహితులు వింతగా చూసేవాళ్లు. అయినా, వాటితో నాకున్న అనుబంధం అలాంటిది. అందుకే ఎవరేమనుకున్నా... తీసేయాలనే ఆలోచన కూడా నాకు వచ్చేదికాదు.

### వాస్తవం తెలియకపోతే..

జీవితం ఆడుతూపాడుతూ సాగిపోవాలని అందరూ కోరుకుంటారు. అలా ఉండాలనుకోవడం తప్పుకాదు! జీవితంలో ఫాంటసీలు ఉండాలి కానీ, ఫాంటసీలే జీవితం కావొద్దు. అన్ని పరిస్థితులూ ఒకేలా ఉండవు కదా! ఊహల్లోనే విహరిస్తుంటే.. వాస్తవం ఏంటో ఎప్పటికీ అర్థం కాదు.

### మూలం తెలుసుకుంటా..

ఏవైనా సవాళ్లు ఎదురైనప్పుడు సమస్య మూలాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తాను. ఏ కోణంలో దాన్ని పరిష్కరించవచ్చో ఆలోచిస్తాను. నా శక్తియుక్తులన్నీ ఉపయోగించి దాన్ని అధిగమించే ప్రయత్నం చేస్తాను.

### నిర్ణయం నాదే..

నేను సినిమాల్లోకి వస్తానంటే నాన్న (శక్తికపూర్) ఎంతో ప్రోత్సహించారు. ఒక యాక్టర్‌గా ఎలా ఉండాలో చెప్పారంతే! అంతేకానీ, సినిమా కథ వినడం, ఓకే చెప్పడం ఇలాంటివి ఎన్నడూ చేయలేదు. నేను సరైన నిర్ణయం తీసుకోగలనని ఆయన నమ్మకం. ఇప్పటి వరకు చేసిన సినిమాలన్నీ నేను ఎంపిక చేసుకున్నవే!

# జంటచిత్రాలకు.. షష్టిపూర్తి 60

రివైండ్ క్లాసిక్స్

**అక్కడో ఎస్టేట్.. ఇక్కడో ఎస్టేట్...**
**అక్కడో జగమొండి.. ఇక్కడో జగమొండి..**
**అక్కడున్న మొండిఘటం కోసం హీరో త్యాగం చేస్తాడు. స్నేహితుడి కోసం, ప్రేయసి బాగు కోసం ఇక్కడున్న మొండిఘటం త్యాగానికి పూనుకుంటాడు. దడ పుట్టించే మెదడున్న ఇద్దరు మనుషులు దౌడు తీయించిన కథలే 'ఆత్మబలం', 'గుడిగంటలు'! ఐదు రోజుల నిడివితో 1964 జనవరిలో విడుదలైన ఈ రెండు సినిమాలు.. చిత్రరాజాల జాబితాలో పదిలంగా చోటు సంపాదించుకున్నాయి. ఈ జంట సినిమాల షష్టిపూర్తి సందర్భంగా... ఒక్కసారి బ్లాక్ అండ్ వైట్‌లోకి వెళ్లిపోదాం...!**

### కథే బలం..

'ఆత్మబలం' సినిమాకు బెంగాలీ చిత్రం అగ్ని సంస్కార మాతృక. కుమార్ (జగ్గయ్య) చిన్నప్పుడే తండ్రి ఆత్మహత్యను చూసి మానసికంగా దెబ్బతింటాడు. తనకు కావాల్సింది దక్కకపోతే చంపనైనా చంపుతాడు, చావనైనా చస్తాడు. పెద్దయ్యేకొద్దీ మరింత కఠినంగా మారుతాడు. కుమార్ ఆస్తిపరుడు. వాళ్ల ఫ్యాక్టరీలో ఆనంద్ (ఏయన్నార్) ఇంజినీర్‌గా పనిచేస్తుంటాడు. కుమార్ తల్లి (కన్నాంబ) చేరదీసిన జయ (సరోజాదేవి), ఆనంద్ ప్రేమించుకుంటారు. అయితే, మానసిక చికిత్సాలయం నుంచి తప్పించుకున్న కుమార్‌ను పట్టుకొని, బుజ్జగించి ఇంటికి తీసుకొస్తాడు ఆనంద్. అక్కడ జయను చూసిన కుమార్.. ఆమెను పెండ్లి చేసుకుంటానని తల్లికి చెబుతాడు. ఆమె కాదంటే ఎక్కడ ప్రాణాలు తీసుకుంటాడో అని కుమార్ తల్లి భయపడుతుంది. తన కొడుకును పెండ్లి చేసుకోవాల్సిందిగా జయను కోరుతుంది. తమను ఆదరించిన యజమానురాలి సంతోషం కోసం ఆనంద్, జయ తమ ప్రేమను త్యాగం చేయడానికి సిద్ధపడతారు. అయితే, జయ తనను కాకుండా ఆనంద్‌ను ప్రేమిస్తున్నదని తెలుసుకుంటాడు కుమార్. తనకు దక్కని జయ అతనికీ దక్కొద్దనుకుంటాడు. తనను ఆనందే చంపినట్లుగా ఆధారాలు సృష్టించి ఆత్మహత్యకు పూనుకుంటాడు. కుమార్‌కు చిన్నప్పటి నుంచి చికిత్స చేసిన డాక్టర్ సాయంతో దాన్ని ఆత్మహత్యగా నిరూపించి, ఆనంద్‌ను ఉరికంబం నుంచి రక్షిస్తుంది జయ. ఇదీ కథ!

**లవర్** బాయ్ ఇమేజ్ ఉన్న అక్కినేని ఈ సినిమాలో హీరో అయినా.. కథంతా జగ్గయ్య పాత్ర చుట్టూనే తిరుగుతుంది. భయం, కోపం, అమాయకత్వం కలగలసిన పాత్రను జగ్గయ్య అద్భుతంగా పండించాడు. నేపథ్య సంగీతం సినిమాకు అదనపు బలాన్నిచ్చింది. సినిమా కథ విన్నాక ఇందులో పాటలకు అవకాశమే లేదన్నాడట సంగీత దర్శకుడు కేవీ మహదేవన్. అక్కినేని, సరోజాదేవి మధ్య లవ్ ట్రాక్ పక్కాగా కుదిరాక అందమైన ట్యూన్స్ ఇచ్చాడు మహదేవన్. పాటలతోపాటు మాటల్లోనూ ఆచార్య ఆత్రేయ చేయి వేయడంతో ప్రతి పాటతోపాటు సీనూ పండింది. 'హృదయానికి సంబంధించిన సమస్యలు వేదనకే కాని, వాదనకు అందవు' లాంటి డైలాగులు ఆత్రేయ శైలికి అద్దం పడతాయి. తరతరాలుగా అందరినీ ఉర్రూతలూగిస్తున్న 'చిటపట చినుకులు పడుతూ ఉంటే.. చెలికాడే సరసన ఉంటే..' పాట ఈ చిత్రంలోనిదే! 'గిల్లికజ్జాలు తెచ్చుకునే అమ్మాయి.. నీ కండ్లల్లో ఉన్నదీ భలే బడాయి..', 'పరుగులు తీసే నీ వయసునకు.. పగ్గం వేసెను నా మనసు..' పాటలు ఆ తరం ప్రేమికుల గీతాలై మార్మోగాయి. 'ఎక్కడికి పోతావు చిన్నవాడ.. నా చూపుల్లో చిక్కుకున్న వన్నెకాడ..' మరో ఎవర్‌గ్రీన్ పాటగా ప్లేలిస్ట్‌లో చోటు సంపాదించుకుంది. ఇలా సినిమాలోని అన్ని పాటలూ ప్రేక్షకులు కోరుకునే గీతాలై ఇప్పటికీ రేడియోలో రోజూ వినిపిస్తూనే ఉంటాయి.



**సంక్రాంతికి** పెద్దసినిమాలు రావడం తెలుగు చిత్రసీమ రివాజు. అలా 1964లో జనవరి 9న విడుదలైంది 'ఆత్మబలం'. జగపతి పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రంలో అక్కినేని హీరో. జగ్గయ్యది కీలకపాత్ర. దీని చుట్టూనే కథంతా తిరుగుతుంది. బి.సరోజాదేవి, కన్నాంబ, రేలంగి, రమణారెడ్డి, సూర్యకాంతం తదితరులు ఇతర తారాగణం.

**అదే** ఏడాది జనవరి 14న విడుదలైంది 'గుడిగంటలు'. రాజలక్ష్మి ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రంలో ఎన్టీఆర్ హీరో. జగ్గయ్య, కృష్ణకుమారి, నాగయ్య, రేలంగి, గిరిజ, రమణారెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు.

**'ఆత్మబలం'** చిత్రంలో మాటలు ఆత్రేయ పండిస్తే... 'గుడిగంటలు'లో ముళ్లపూడి పూయించారు. కథావస్తువు దాదాపు ఒకటే అయినా... కథనాలు వేరు. సినిమాలు వేరైనా దర్శకుడు మాత్రం ఒకరే కావడం విశేషం. విక్టరీని ఇంటిపేరుగా మలుచుకున్న వి.మధుసూధనరావు ఈ రెండు సినిమాలకు డైరెక్టర్.



### పోటాపోటీ పాటలు..

**'చిటపట** చినుకులు పడుతూ ఉంటే.. చెలికాడే సరసన ఉంటే..' చలికాలంలో వర్షరుతువును మోసుకొచ్చిన పాట. 'ఆత్మబలం'లోని ఈ గీతానికి వంతగా 'గుడిగంటలు'లో పీబీ శ్రీనివాస్ ఎత్తుకున్న 'నీలికన్నుల నీడలలోనా..' పాట పొగమంచు హత్తుకున్న చలిగాలికి మరింత మత్తెక్కించింది. ఈ తన్మయత్వంలో ఉండగానే.. 'ఎక్కడికీ పోతావు చిన్నవాడ..' ఓ థియేటర్‌లోంచి సుశీలమ్మ నిలదీత! 'జన్మమెత్తితిరా....' అని మరో థియేటర్ నుంచి ఘంటసాల బదులు! ఇలా పోటాపోటీగా సాగిన పాటలు.. ఈ రెండు చిత్రాల మ్యూజిక్ ఆల్బమ్స్‌ను పదిలంగా దాచుకునేలా చేశాయి.

### స్వార్థాన్ని గెలిచిన స్నేహం

తమిళంలో వచ్చిన 'ఆలయమణి' చిత్రం 'గుడిగంటలు' సినిమాకు మాతృక. కథలోకి వెళ్తే... వాసు (ఎన్టీఆర్) జమీందారు. అతని ప్రాణ స్నేహితుడు హరి (జగ్గయ్య). చిన్నప్పటి నుంచి వాసుది తీవ్రమైన మనస్తత్వం. తన వస్తువును ఎవరైనా తీసుకుంటే ఒప్పుకోడు. వాసు మనసెరిగి ప్రవర్తిస్తుంటాడు హరి. ఎస్టేట్ మేనేజర్ సుబ్బయ్య (నాగయ్య) కూతురు కస్తూరి (కృష్ణకుమారి), హరి ప్రేమించుకుంటారు. అతనితో సరదాగా తన పేరు మాయ అని చెబుతుంది కస్తూరి. అనుకోకుండా కస్తూరిని చూసిన వాసు ఆమెను పెండ్లి చేసుకోవాలనుకుంటాడు. కస్తూరి అక్క ఊహించని సమస్యలో ఇరుక్కుంటుంది. కుటుంబ గౌరవం కోసం వాసును పెండ్లి చేసుకునేందుకు కస్తూరి ఒప్పుకోక తప్పదు. తన స్నేహితుడు పెండ్లాడుతున్న కస్తూరే మాయ అని హరికి తర్వాత తెలుస్తుంది. స్నేహితుడి కోసం తన ప్రేమను త్యాగం చేస్తాడు. నిశ్చితార్థం తర్వాత ఓ ప్రమాదంలో వాసు కాళ్లు చచ్చుబడిపోతాయి. వాసును కంటికి రెప్పలా చూసుకుంటుంది కస్తూరి. ఎస్టేట్‌లో కొందరు హరి, కస్తూరి చనువుగా ఉంటున్నారని వాసులో అనుమాన బీజం నాటుతారు. హరిని చంపాలనుకుంటాడు వాసు. కొండ పైనుంచి కిందికి తోసేస్తాడు. ప్రమాదం నుంచి తప్పించుకున్న హరి తను ప్రేమించిన మాయే.. కస్తూరి అని, మా ప్రేమ త్యాగం చేశామని చెబుతాడు. ప్రేమికులను విడదీశానని పశ్చాత్తాపంతో వాసు కొండ పైనుంచి దూకి ఆత్మహత్యకు యత్నిస్తాడు. వాసు చనిపోయాడనే భావిస్తారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన వాసు.. కొన్నాళ్లకు జమీందారు ఇంట్లో పెండ్లి జరుగుతుందన్న వార్త విని, హరి, కస్తూరి వివాహం చేసుకుంటున్నారని భావిస్తాడు. ఆ పెండ్లి చూడటానికి ఆనందంగా వెళ్తాడు. అక్కడ హరి మరో అమ్మాయిని పెండ్లాడటం చూసి ఆశ్చర్యపోతాడు. పెండ్లి కాకుండానే వైధవ్యాన్ని అనుభవిస్తున్న కస్తూరి నిర్మలమైన మనసుకు వాసు చలించిపోతాడు. ఆమెను పెండ్లి చేసుకోవడంతో కథ ముగుస్తుంది.



**ప్రతి** మనిషిలోనూ మంచి, చెడు రెండూ ఉంటాయి. ఈ రెండిటి మధ్య జరిగే రణమే 'గుడిగంటలు' సినిమా. విపరీత మనస్తత్వం ఉన్న వ్యక్తి పాత్రలో ఎన్టీఆర్ జీవించాడు. కథ, కథనాలు అందంగా అమరడంతో ఈ చిత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ ఏడాది మూడో ఉత్తమ చిత్రంగా కాంస్య నందిని అందుకుంది. మధుసూదనరావు డైరెక్షన్, ఘంటసాల సంగీతం ఈ చిత్రానికి బలాలు! సి.నారాయణ రెడ్డి రాసిన 'నీలికన్నుల నీడలలోనా.. దోరవయసుల జావళిలోనా..', ఆరుద్ర విరచిత 'దూరాన నీలి మేఘాలు...', ఆత్రేయ రచించిన 'ఎవరికి వారౌ స్వార్థంలో..', దాశరథి రాసిన 'నీలోన నన్నే నిలిపేవు నువ్వే..' పాటలు ఆపాత మధురాల జాబితాలో స్థిరంగా నిలిచిపోయాయి. అనిశెట్టి రచించిన 'జన్మమెత్తితిరా అనుభవించితిరా.. బ్రతుకు సమరంలో పండిపోయితిరా..' పాట చిత్రానికే హైలైట్‌గా నిలిచింది. 'స్వార్థమనే పిశాచి మదిని స్వారి చేసెరా.. బ్రతుకంతా చెలరేగిన ప్రళయమాయెరా.. దైవశక్తి మృగత్వమును సంహరించెరా.. సమరభూమి నా హృదయం శాంతిపొందెరా' అని సాగే చరణం... కథానాయకుడి మారిన మనసుకు అద్దం పడుతుంది.

**చివరగా..** గాయపడిన మనసులు అందరి మనుషుల్లా మసులుకోవడం కష్టమే! అండగా నిలిచిన మనసును అర్థం చేసుకుంటే కానీ, వారికి ఊరట లభించదు. 'ఆత్మబలం'లో.. ఆ మనసును బలవంతంగా గెలుచుకోవాలని ప్రయత్నించి కుమార్ ఓడిపోతాడు. 'గుడిగంటలు' చిత్రంలో ఆ మనిషిని అర్థం చేసుకొని, తన మనసును మార్చుకున్న వాసు గెలిచాడు. వలచిన మనసును గెలవడం అంటే.. ఆ మనిషిని అర్థం చేసుకోవడమే! అప్పుడు ప్రతి గుండెలో గుడిగంటలు ప్రతిధ్వనిస్తాయి.



ఓటీటీ హిట్

## కిరాతకులు

బ్యాడ్‌ల్యాండ్ హంటర్స్

**నెట్‌ఫ్లిక్స్:** జనవరి 26
**తారాగణం:** మా డోంగ్ సియాక్, నో జాంగ్, లీ జూన్, కిమ్ యంగ్ సన్ తదితరులు.
**దర్శకత్వం:** హా యంగ్ హింగ్.

సియోల్ నగరంలో యంగ్ అనే శాస్త్రవేత్త ఉంటాడు. అనుకోకుండా అతని కూతురు చనిపోతుంది. తన ప్రయోగాల ద్వారా కూతురిని బతికించుకోవాలని అనుకుంటాడు. ఈ క్రమంలో ఎందరి ప్రాణాలనో బలి తీసుకుంటాడు. విషయం తెలిసిన పోలీసులు యంగ్‌ను అరెస్ట్ చేయడానికి సిద్ధమవుతారు. అదే సమయంలో భారీ భూకంపం రావడంతో సియోల్‌తో పాటు చుట్టుపక్కల నగరాలన్నీ నేలమట్టం అవుతాయి. భూకంపం నుంచి బతికి బయటపడ్డ ప్రజలు బృందాలుగా చిన్నచిన్న టెంట్ విలేజ్‌లు నిర్మించుకుంటారు. ఆ విపత్తులో ప్రాణాలతో బయటపడ్డ యంగ్.. తన కూతురు మృతదేహాన్ని రసాయనాల్లో భద్రపరుస్తాడు. ఓ అపార్ట్‌మెంట్‌ను తన ప్రయోగశాలగా మారుస్తాడు. కొందరు సైనికుల సాయంతో ఆరోగ్యవంతులైన యువతీయువకులను తీసుకొచ్చి ప్రయోగాలు చేస్తుంటాడు. ఇదే క్రమంలో మాయమాటలు చెప్పి ఓ టెంట్ విలేజ్ నుంచి సున అనే యువతిని అపార్ట్‌మెంట్‌కు రప్పిస్తాడు. సునతో వెళ్లిన ఆమె బామ్మను కొందరు దుండగులు చంపుతుండటాన్ని టెంట్ విలేజ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు చూస్తారు. సున ప్రమాదంలో ఉందని గ్రహిస్తారు. ఆమెను కాపాడటానికి అపార్ట్‌మెంట్‌కు వెళ్తారు. వీరి ప్రయత్నం సఫలమైందా? యంగ్ ప్రయోగాలను వీళ్లు అడ్డుకున్నారా, లేదా? అన్నది మిగిలిన కథ. తెలుగు డబ్బింగ్ వెర్షన్ అందుబాటులో ఉంది.

## భక్షక్ @ నెట్‌ఫ్లిక్స్

రెడీ టు రిలీజ్

**స్ట్రీమింగ్ తేదీ:** ఈ నెల 9 నుంచి.

క్రైమ్ థ్రిల్లర్లకు, ఇన్వెస్టిగేషన్ చిత్రాలకు ఓటీటీ ప్రేక్షకులు బలంగా ఓటేస్తున్నారు. దీంతో దర్శక, నిర్మాతలు ఈ తరహా చిత్రాలను నిర్మించి నేరుగా ఓటీటీలో విడుదల చేస్తున్నారు. ఈ నెల 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న 'భక్షక్' సస్పెన్స్ జానర్ చిత్రంగా రూపుదిద్దుకుంది. భూమి పెడ్నేకర్, సంజయ్ మిశ్రా, ఆదిత్య శ్రీవాస్తవ్ తదితరులు ఇందులో నటించారు. గౌరీఖాన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి పుల్‌కిత్ దర్శకత్వం వహించాడు. ఇందులో భూమి ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా నటిస్తున్నది. అనాథ శరణాలయాల్లో బాలికలపై జరుగుతున్న అకృత్యాలను కథానాయిక ఎలా బయటపెట్టింది, ఈ క్రమంలో ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నది అన్నది కథ. బుధవారం విడుదలైన ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో... 'భక్షక్' టీమ్ సినిమా రికార్డు స్ట్రీమింగ్ సాధిస్తుందన్న నమ్మకంతో ఉంది.

